











సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరు

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ప్రతి సచివాలయం పరిధిలో సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేసినట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 11వ వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల నుంచి సంక్షేమ పండగ జరుగుతోందన్నారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందిన పథకాలను వివరించడంతోపాటు సమస్యలను తెలుసుకుని వాటిని సంబంధిత అధికారుల ద్వారా వీలైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు ఇచ్చిందని, ఈ నిధులతో వేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 73 సచివాలయాల పరిధిలో ఇళ్లకు వెళ్లామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్‌ మోర్ల సుప్రజ, వైస్‌ చైర్‌పర్సన్‌ కోటంరెడ్డి లలిత, వైస్‌ చైర్మన్‌ షాహుల్‌, కౌన్సిలర్లు రాచూరి సత్యనారాయణ, చీర్ల ప్రసాద్‌, యానాదిరెడ్డి, ప్రమీలమ్మ, షకీలాబేగం, లక్ష్మీకాంతమ్మ, రహమత్‌, శివకుమార్‌రెడ్డి, మల్లారెడ్డి శ్రీదేవి, కమిషనర్‌ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్‌ సుధీర్‌, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అల్లాభక్షు, డాక్టర్‌ అల్లాభక్షు, చిన్న అల్లాభక్షు, చాందిని, నరసింహులు, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

పాడి రైతులకు అండగా ప్రభుత్వం

- ఏపీఎల్‌డీఏ చైర్మన్‌ విజయ్‌కుమార్‌

ఇందుకూరుపేట: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు అన్ని విధాలుగా అండగా ఉందని ఏపీఎల్‌డీఏ చైర్మన్‌ గొల్లపల్లి విజయ్‌కుమార్‌ తెలిపారు. పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని జగదేవిపేటలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం చేసే రైతులు ప్రత్యామ్నాయ ఆదాయం కోసం పాడి పోషణ చేపట్టాలని సూచించారు. పశువుల కోసం 1962 కాల్‌ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యాధునిక ల్యాబ్‌ పెట్టించి వైద్య సేవలందిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. జేడీ డాక్టర్‌ మహేశ్వరుడు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వైద్యసేవలు గురించి వివరించారు. అనంతరం ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత గోపూజ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్‌ డైరెక్టర్‌ గునుపాటి సురేష్‌రెడ్డి, డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్‌ సోమయ్య, డీడీ డాక్టర్‌ సురేష్‌, ఏడీ మురళీకృష్ణ, స్థానిక నాయకులు సునీల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, వైద్యాధికారులు వసంతరాయులు, నాగేంద్ర, జ్యోతి, జగదీష్‌, కరిముల్లా, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.



గోపూజ చేస్తున్న విజయ్‌కుమార్‌

సామాజిక బాధ్యతగా తీసుకోవాలి

వెంకటాచలం: మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ జీఎం సుందరవల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం, శివాజీ యూత్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. రిజిస్ట్రార్‌ డాక్టర్‌ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్‌ విజయానంద్‌కుమార్‌ బాబు, ఎన్‌ఎస్‌ఎస్‌ కో–ఆర్డినేటర్‌ డాక్టర్‌ ఉదయ్‌శంకర్‌, శివాజీ యూత్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ మోపూరు భాస్కర్‌నాయుడు, నోవా బ్లడ్‌బ్యాంక్‌ సభ్యులు వెంకట కిశోర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు, వ్యాపారుల హర్షం

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని చెన్నూరు రోడ్డుకు ఏర్పాటు చేస్తున్న సెంట్రల్‌ లైటింగ్‌లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రకటించడంతో రోడ్డుకిరువైపులా ఉంటున్న ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ లైటింగ్‌ వేయడం ద్వారా రోడ్డు కుచించుకుపోయి వాహన రాకపోకలకు ఇబ్బందులు కలగడంతోపాటు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటారని ఇటీవల వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై చర్చించిన తర్వాత ఎమ్మెల్యే సెంట్రల్‌ లైటింగ్‌కు బదులు రోడ్డుకిరువైపులా లైట్లను ఏర్పాటు చేస్తామని చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు.



కామాక్షితాయి సేవలో సివిల్‌ జడ్జి


బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన సీనియర్‌ సివిల్‌ జడ్జి సి.మురళీధర్‌ తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్‌ పుట్టా లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.



ఆలయం వద్ద జడ్జి, కుటుంబ సభ్యులు

ప్రజా సంక్షేమమే లక్ష్యం

తోటపల్లిగూడూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని మండల పరిషత్‌ అధ్యక్షురాలు ఉప్పల స్వర్ణలత అన్నారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులు నాయుడు, కంజి నీలమ్మ, ఎంపీడీఓ హేమలత, స్థానిక ఎంపీటీసీ రాయపు శీనయ్య పాల్గొన్నారు.



డాక్టరేట్‌ ప్రదానం

వెంకటాచలం: మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) లైబ్రరీ విభాగంలో పనిచేస్తున్న కరేటి సుజాతకు కుప్పం ద్రవిడియన్‌ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. అక్కడి డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ లైబ్రరీ అండ్‌ ఇన్ఫర్మేషన్‌ సైన్స్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ అవినేని కిశోర్‌బాబు పర్యవేక్షణలో జాబ్‌ శాటిస్ఫాక్షన్‌ ఎమాంగ్‌ యూనివర్సిటీ లైబ్రరీ ప్రొఫెషనల్స్‌ ఇన్‌ ఆంధ్రప్రదేశ్‌ ఏ స్టడీ అనే అంశంపై సుజాత థీసెస్‌ సమర్పించారు.




సుజాత



‘కోవూరులో టీడీపీ గ్రాఫ్‌ పడిపోయింది’

బుచ్చిరెడ్డిపాళెం: ‘టీడీపీ నాయకుడు నారా లోకేశ్‌ సర్కస్‌లో బఫూన్‌ లాంటి వాడు. కోవూరు నియోజకవర్గంలో ఇప్పటికే 20 శాతానికి పడిపోయిన ఆ పార్టీ గ్రాఫ్‌ యువగళం పాదయాత్రతో పది శాతానికి పడిపోయింది.’ అని డీసీఎంఎస్‌, డీఏఏబీ చైర్మన్లు వీరి చలపతిరావు, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 11వ వార్డులో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని విమర్శించే స్థాయి లోకేశ్‌కు లేదన్నారు. లోకేశ్‌ ఒక్కసారి కూడా గెలవలేదని, మరో వ్యక్తి మొదటిసారి ఓటమి చెందేందుకు సిద్ధంగా ఉన్నడని గుర్తుచేశారు. కోవూరులో టీడీపీ గెలుస్తుందని నమ్మకం కలిగితే చంద్రబాబు లేదా లోకేశ్‌ పోటీ చేయాలని సవాల్‌ విసిరారు. నీరు–చెట్టు ద్వారా గత టీడీపీ ఎమ్మెల్యే అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. బుచ్చిరెడ్డిపాళెం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని, దీనిపై విమర్శలు చేయడం తగదని తెలిపారు. లోకేశ్‌ మాట్లాడిన తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు.



ఎన్నికలప్పుడే ఎన్టీఆర్‌ గుర్తుకొస్తారు

ఇందుకూరుపేట: టీడీపీకి ఎన్నికల సమయంలోనే ఎన్టీఆర్‌ గుర్తుకొస్తారని, అవి పూర్తయితే ఫొటోలు, ఫ్లెక్సీలు పక్కన పడేస్తారని ఏపీఎల్‌డీఏ చైర్మన్‌ గొల్లపల్లి విజయ్‌కుమార్‌ విమర్శించారు. మండలంలోని జగదేవిపేటలో డీసీఎంఎస్‌ డైరెక్టర్‌ గునపాటి సురేష్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్టీఆర్‌ పేరు చెప్పకుండా మమ్మల్ని చూసి ఓటు వేయమని అడిగే దమ్ము చంద్రబాబు, లోకేశ్‌కు ఉందా అని ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండని అడిగే వ్యక్తి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పేదలకు ఎమ్మెల్యే ప్రసన్న అండగా నిలిచినట్లు చెప్పారు. ఆపదలో ఉన్నవారిని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్‌ ద్వారా ఆదుకుంటున్నారన్నారు. లోకేశ్‌ ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్‌ చదువుతున్నారన్నారు. పోలంరెడ్డి హయాంలో ఒక్క రోడ్డు అయినా వేశారా అని ప్రశ్నించారు. లేబూరు, మూలపాడు రోడ్లు వెంకయ్యనాయుడు చొరవతో పీఎంజీసీ కింద వేసినట్లు చెప్పారు.





చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకటాచలం: ఈనెల 3వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని కాకుటూరు గ్రామానికి చెందిన సనగూరి పెంచలయ్య (34) నెల్లూరులోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పెంచలయ్య సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.







